సాక్షి బాపట్ల

శనివారం, 26, అక్టోబర్, 2024



భక్తిశ్రద్ధలతో గ్యార్మీ వేడుకలు

పొన్నూరు: స్థానిక ఐదో వార్డు డఫ్‌పేట ముస్లిం యూత్ ఆధ్వర్యంలో జెండా చెట్టు వద్ద శుక్రవారం గ్యార్మీ వేడుకలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. భారీ ర్యాలీ నిర్వహించారు.



పశుగణన పోస్టర్లు విడుదల

గుంటూరు ఎడ్యుకేషన్: జిల్లాలో పశుగణనను విజయవంతం చేయాలని జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా పేర్కొన్నారు. జెడ్పీ క్యాంపు కార్యాలయంలో పోస్టర్లను విడుదల చేశారు.



తిరుపతమ్మ సన్నిధిలో సందడి

పెనుగంచిప్రోలు: శ్రీతిరుపతమ్మ సన్నిధిలో శుక్రవారం భక్తజన సందడి అధికంగా ఉంది. మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో మహిళల కోలాటం ఆకట్టుకుంది.

న్యూస్‌రీల్

మిర్చి యార్డు పర్సన్ ఇన్‌చార్జిగా జేసీ

కొరిటెపాడు (గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డు పర్సన్ ఇన్‌చార్జిగా జాయింట్ కలెక్టర్ భార్గవ్ తేజ నియమితులయ్యారు. ఈ మేరకు మార్కెటింగ్ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ బి.రాజశేఖర్ శుక్రవారం జీఓ నంబర్ 671 జారీ చేశారు. ఇప్పటి వరకు యార్డు పర్సన్ ఇన్‌చార్జిగా కొనసాగిన మార్కెటింగ్‌శాఖ జాయింట్ డైరెక్టర్ కాకుమాను శ్రీనివాసరావు స్థానంలో జాయింట్ కలెక్టర్ భార్గవ్ తేజను నియమిస్తూ జీఓ జారీ చేశారు. ఒకటి, రెండు రోజుల్లో ఆయన బాధ్యతలు చేపట్టనున్నారు. గుంటూరు మార్కెట్ యార్డుకు చైర్మన్ నియామకం జరిగే వరకు ఆయన పర్సన్ ఇన్‌చార్జిగా కొనసాగనున్నారు.

ఉద్యోగాల భర్తీ నిలిపివేయాలి



నెహ్రూనగర్: రాష్ట్రంలో వర్గీకరణ అమలయ్యేంత వరకు ఎలాంటి ఉద్యోగ భర్తీలు చేపట్టవద్దని సీఎం చంద్రబాబుకు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ విజ్ఞప్తి చేశారు. శుక్రవారం గుంటూరులో ఆయన విలేకరులతో మాట్లాడారు. గతంలో చంద్రబాబు నాయుడే వర్గీకరణ చేశారని, ఇప్పుడు కూడా ఆయన ద్వారానే జరుగుతుందన్న పూర్తి విశ్వాసం ఉందని పేర్కొన్నారు ఎస్సీ వర్గీకరణ అయ్యేంత వరకు ఏపీపీఎస్సీ నుంచి ఎలాంటి ఉద్యోగ భర్తీలు చేయవద్దని చైర్మన్‌కు విజ్ఞప్తి చేశారు. వారం రోజుల్లో ఎమ్మార్పీఎస్ ప్రతినిధి బృందం సీఎంను కలవనున్నట్లు ఆయన తెలిపారు.

కాలువలో పడి రైతు గల్లంతు

తెనాలిరూరల్: కాలువలో పడి రైతు గల్లంతైన ఘటన తెనాలి మండలం కొలకలూరులో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన 55 ఏళ్ల ఏడుకొండలు పొలానికి మందు కొట్టేందుకు సైకిల్‌పై వెళుతుండగా దానికి తగిలించిన కవరు తెగి కొమ్మమూరు కాలువ గట్టు వెంబడి పడింది. కవరు తీసుకునే క్రమంలో ప్రమాదవశాత్తు కాలు జారి కాలువలో పడి గల్లంతయ్యాడు. రూరల్ ఎస్ఐ సీహెచ్ ప్రతాప్ ఘటనా స్థలాన్ని పరిశీలించి గాలింపు చర్యలు చేపట్టారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అఖిల భారత పశుగణన పోస్టర్ల ఆవిష్కరణ



రేపల్లె రూరల్: పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో నిర్వహించే 21వ అఖిల భారత పశుగణన పోస్టర్లను పట్టణంలోని రాష్ట్ర రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ క్యాంప్ కార్యాలయంలో టీడీపీ నాయకుడు అనగాని శివప్రసాద్ శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పశుసంవర్ధకశాఖ రేపల్లె సహాయ సంచాలకులు డాక్టర్ నాంచారయ్య మాట్లాడుతూ పశు గణన కార్యక్రమాన్ని ఈనెల 25వ తేదీ నుంచి వచ్చే ఏడాది ఫిబ్రవరి 28 వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. సిబ్బంది ఇంటింటికీ వెళ్లి సమగ్ర సమాచారాన్ని సేకరిస్తారని పేర్కొన్నారు. పశు గణన ద్వారా పథకాల రూపకల్పనకు ప్రణాళికలు సిద్ధం చేయవచ్చని తెలిపారు. పశు యజమానులు కూడా సహకరించాలని ఆయన కోరారు. పశు గణన పూర్తి చేసిన ఇళ్లకు సిబ్బంది హౌస్‌హోల్డ్ స్టిక్కర్లు అంటిస్తారని చెప్పారు. కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ అధికారులు ఎ. ప్రవీణ్ కుమార్, రోషన్ బేగ్, మున్సిపల్ కమిషనర్ సాంబశివరావు, పశుసంవర్ధకశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

అలరించిన నాటికలు

నగరంపాలెం(గుంటూరు): స్థానిక మార్కెట్ కూడలిలోని శ్రీవేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో అల్లు రామలింగయ్య నాటక కళా పరిషత్-వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఆహ్వాన నాటిక పోటీలు శుక్రవారం రెండో రోజు కొనసాగాయి. కావూరి సత్యనారాయణ రచన, యేపూరి హరి దర్శకత్వం వహించిన చిగురు మేఘం (గుంటూరు) నాటిక ప్రదర్శన ఆద్యంతం ఆకట్టుకుంది. అనంతరం పోలదాస్ శ్రీను రచన, దర్శకత్వం వహించిన నిశి (ఎన్టీఆర్ జిల్లా) నాటికను ప్రదర్శించారు. ఈ నాటికలు సభికులను అలరించాయి. కార్యక్రమంలో ఆరో డివిజన్ కార్పొరేటర్ పోతురాజు సమత, పోతురాజు చంద్రశేఖర్, ప్రముఖ సినీ దర్శకులు కొండా రాంబాబు, మాదాసు మధు, పీవీకేనాయుడు మార్కెట్ అధ్యక్షుడు వీరిశెట్టి లక్ష్మీనారాయణ, సొసైటీ అధ్యక్షులు పి.శివప్రసాద్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.



కొల్లూరు మండలం గాజుల్లంక కృష్ణా నది ఒడ్డు వెంబడి ఇసుక ట్రాక్టర్ల స్వైరవిహారం

ఇసుక తోడేళ్లతో ముప్పు

కృష్ణా నదిలో అక్రమంగా ఇసుక తవ్వకాలు జాతరను తలపిస్తున్నాయి. తీర గ్రామాల మనుగడకు ముప్పులా మారాయి. ఇసుక తోడేళ్లతో తమ ఉనికికే ప్రమాదం ఏర్పడంతో ప్రజలు నిరసన గళం వినిపిస్తున్నారు. లెక్కకు మిక్కిలిగా ట్రాక్టర్లతో ఇసుక తరలింపుతో నదీ తీర గ్రామాల్లో పర్యావరణ సమస్యలు తలెత్తుతున్నాయి. నదీ గర్భం కోసుకుపోతోంది. ఇసుక తరలింపు వాహనాలు సృష్టిస్తున్న బీభత్సంపై స్థానికులు తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు.

– కొల్లూరు

- నదిలో ఇసుక ట్రాక్టర్ల స్వైరవిహారం
- ముప్పుగా మారుతున్న తవ్వకాలు
- గ్రామాల్లో ఇసుక తవ్వకాలపై ఆక్షేపణలు
- సచివాలయంలో నమోదు మాటలకే పరిమితం
- నదీ తీర గ్రామాల్లో తవ్వకాలను అడ్డుకుంటున్న ప్రజలు

ఇసుక తోడేళ్లతో నదీ తీర గ్రామాల మనుగడకు ముప్పు వాటిల్లుతోంది. సొంత అవసరాలకు ఇసుకను తరలించుకోవచ్చన్న ప్రభుత్వ నిబంధన అక్రమార్కుల పాలిట వరంగా మారింది. నదీ తీర గ్రామాలకు చెందిన ట్రాక్టర్లకు తోడు, సుదూర ప్రాంతాల నుంచి వందల సంఖ్యలో తరలివస్తున్న వాహనాలతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. కృష్ణా నదీ తీర గ్రామాలైన పెసర్లంక అరవింద వారధి, గాజుల్లంక, ఈపూరులంక, చింతర్లంక, జువ్వలపాలెం గ్రామాల్ని అనుకొని కృష్ణా నది ప్రవహిస్తోంది. ఇక్కడ నుంచి పగలు, రాత్రీ తేడా లేకుండా వందల సంఖ్యలో ట్రాక్టర్లతో అక్రమార్కులు ఇబ్బడిముబ్బడిగా ఇసుకను తరలిస్తున్నారు. తెనాలి, వేమూరు, చెరుకుపల్లి, రేపల్లె, అమృతలూరు, చుండూరు, భట్టిప్రోలు, గుంటూరు ప్రాంతాల్లో ట్రాక్టర్ ఇసుకను రూ. 4 వేల నుంచి రూ. 7 వేల వరకు అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు.

తీర గ్రామాల మనుగడకు ముప్పు

తీరం వెంబడి ఒడ్డుకు రక్షణగా సహజ సిద్ధంగా ఏర్పడిన ఇసుక, బుసక మేటలు ఇష్టానుసారంగా తవ్వి తరలించుకుపోతున్నారు. దీనివల్ల నదిలో నీటి ప్రవాహం ఉన్న సమయంలో తీరం వెంబడి పంట పొలాలు కోతకు గురయ్యే ప్రమాదం పొంచి ఉంది. ఇష్టారాజ్యంగా చేపడుతున్న తవ్వకాలతో పంట పొలాలు మునిగిపోతాయి. భవిష్యత్తులో నదీ కోతలు ఉధృతమై గ్రామాలకు సైతం ముప్పు ముంచుకొచ్చే పరిస్థితులు ఉండటంతో లంక గ్రామాల ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు.

అక్రమార్కులకు కాసుల పంట

కృష్ణా నది నుంచి ఉచిత ఇసుక తరలింపు విషయంలో ప్రభుత్వం పేర్కొంటున్న నిబంధనలు మచ్చుకైనా అమలుకాకపోవడం ఇసుక అక్రమ రవాణాదారులకు కాసుల పంట పండిస్తోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇసుక ధర చుక్కలను అంటింది. ఆ మచ్చను పోగొట్టుకోవాలని ప్రభుత్వం నిబంధనల్ని అమలు చేయడంలో చేస్తున్న తాత్సారం కారణంగా కృష్ణా నదీ తీర గ్రామాల్లో ఇసుక అక్రమ రవాణాకు అడ్డూఅదుపు లేకుండా పోయింది. సొంత అవసరాలకు తరలించుకునే వ్యక్తులు గ్రామ, వార్డు సచివాలయాలలో నమోదు చేయించుకొని తరలించుకోవచ్చుననే నిబంధన మాటలకే పరిమితమైంది.

దెబ్బతింటున్న రహదారులు

వారం రోజుల వ్యవధిలో పెసర్లంక, చింతర్లంక గ్రామాల్లో ఇసుక ట్రాక్టర్ల విచ్చలవిడిగా తోలకాల కారణంగా రహదారులు దెబ్బతిన్నాయి. మితిమీరిన వేగంతో ట్రాక్టర్లు ప్రయాణిస్తుండటంతో ప్రాణాలకు సైతం ముప్పుగా మారడంతో ఇసుక తరలింపును గ్రామస్తులు అడ్డుకున్నారు. పరిస్థితి మరింత దారుణంగా తయారవడంతో గాజుల్లంక, ఈపూరులంక ప్రజలు తవ్వకాల్ని నిలుపుదల చేయాలని తీర్మానించడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది.



కొల్లూరు మండలం ఈపూరులంక నుంచి ఇసుక నింపుకొని వెళుతున్న ట్రాక్టర్లు

నిబంధనలు అందలేదు

ప్రభుత్వం ప్రకటించిన ఉచిత ఇసుక విధానంలో అవలంబించాల్సిన నూతన విధి విధానాలు, నిబంధనలు ప్రస్తుతం మాకు అందలేదు. సచివాలయాలలో సొంత అవసరాలకు ఇసుక తరలింపు నమోదు ప్రక్రియ ఆదేశాలు అందిన అనంతరం అమలు చేస్తాం. మండలంలో ప్రస్తుతం గాజుల్లంక, జువ్వలపాలెం ప్రాంతాలలో ఇసుక రీచ్‌ల నిర్వహణకు అనుమతులున్నా, నదిలో వరద ప్రవాహం కారణంగా మైనింగ్ శాఖ గుర్తించిన ప్రాంతాల్లో తవ్వకాలకు అవకాశం లేకుండా పోయింది.

– బి. వెంకటేశ్వర్లు, తహసీల్దార్, కొల్లూరు

బాణసంచా విక్రయాలకు అనుమతులు తప్పనిసరి

జిల్లా ఎస్పీ తుషార్ డూడీ



బాపట్ల: బాణసంచా తయారీ కేంద్రాలు, నిల్వ చేసే గోడౌన్స్, దుకాణాలకు తప్పనిసరిగా ప్రభుత్వ అనుమతి ఉండాలని జిల్లా ఎస్పీ తుషార్ డూడీ స్పష్టం చేశారు. నిబంధనలు పాటించని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రాబోయే దీపావళి పండుగను దృష్టిలో ఉంచుకొని జిల్లాలో అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా తీసుకోవాల్సిన ముందస్తు చర్యల గురించి శుక్రవారం జిల్లా ఎస్పీ పోలీస్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. పోలీస్ అధికారులు వారి పరిధిలోని బాణసంచా తయారీ కేంద్రాలు, దుకాణాలు, గోడౌన్లను సందర్శించి లైసెన్స్‌లు తనిఖీ చేయాలని ఆదేశించారు. భద్రత ప్రమాణాలు ప్రభుత్వ నిబంధనల అనుగుణంగా ఉన్నాయో లేదో పరిశీలించాలని తెలిపారు. పాటించని వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారుల్ని ఎస్పీ ఆదేశించారు. జిల్లాలో ఎక్కడైనా బాణసంచా అక్రమ విక్రయాలు, నిల్వలకు సంబంధించిన సమాచారం ఉంటే డయల్ 100, 112 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని ప్రజల్ని కోరారు.

నిబంధనలు ఇవి..

- తప్పనిసరిగా సంబంధిత అధికారుల నుంచి అనుమతులు పొందాలి.
- నివాస ప్రాంతాలకు దుకాణాలు నిర్దిష్ట దూరంలో ఉండాలి.
- అగ్ని ప్రమాదాలు చోటు చేసుకోకుండా భద్రత ప్రమాణాలు పాటించాలి.
- ప్రమాదం జరగడానికి అవకాశం ఉండే సిగరెట్లు తాగడం వంటి చర్యలు చెయ్యరాదు.
- మండే స్వభావం వున్న పెట్రోల్, అగ్గి పెట్టెలు ఇతర వస్తువులు అనుమతించరాదు.
- అగ్ని ప్రమాదం సంభవిస్తే తీసుకోవలసిన చర్యలపై సిబ్బందికి అవగాహన ఉండాలి.
- దుకాణాలను అధికారులు సూచించిన ప్రదేశాలలోనే ఏర్పాటు చేసుకోవాలి.

ఆ ఇద్దరిపై చర్యలేవీ!?

- సహానా హత్య కేసులో నిందితుడి స్నేహితుల పాత్రపై అనుమానం
- ఆస్పత్రిలో నవీన్‌తోపాటు ఇద్దరిని చూశానన్న సహానా తల్లి
- ఫిర్యాదులో ఉన్నా అరెస్టు సందర్భంలో లేని స్నేహితుల ప్రస్తావన
- రాజకీయ ఒత్తిళ్లే కారణమా?

తెనాలి రూరల్: రౌడీషీటర్ రాగి నవీన్ చేసిన అమానుష దాడిలో బ్రెయిన్ డెడ్ అయి మరణించిన సహానా కేసు విచారణలో మృతురాలి కుటుంబ సభ్యులు, బంధువులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు అరెస్టు చేసిన నిందితుడితో పాటు అతని స్నేహితులపై చర్యలు తీసుకోకపోవడం వీరి అనుమానాలకు ప్రధాన కారణం .ఈనెల 19న సహానాను నవీన్ తన కారులో సాయంత్రం 6.20 గంటల ప్రాంతంలో తీసుకెళ్లి తెనాలి మండలం కఠెవరం నుంచి ఎరుకలపూడి వెళ్లే మార్గంలో ఆమెపై దాడిచేశాడు. సహానా వాంతులు చేసుకుని అపస్మారక స్థితిలోకి వెళ్లడంతో ఆమెను తెనాలి ఆర్టీసీ బస్టాండ్ వెనుకనున్న ఓ ప్రైవేటు వైద్యశాలకు తీసుకెళ్లాడు. అక్కడ వైద్యులు అందుబాటులో లేరని చెప్పడంతో సహానా తల్లి అరుణకుమారికి ఫోన్‌చేసి విషయం చెప్పి, ప్రకాశం రోడ్డులోని మరో వైద్యశాలకు తన ఇద్దరు స్నేహితులతో కలిసి తీసుకెళ్లాడు. అక్కడకు సహానా తల్లి రాగానే ముగ్గురూ జారుకున్నారు. ఇక పోలీసులకు అరుణకుమారి ఇచ్చిన ఫిర్యాదులో నవీన్, అతని స్నేహితుల ప్రస్తావన ఉంది. కానీ, 22వ తేదీ సాయంత్రం మీడియాకు నవీన్ అరెస్టు విషయాన్ని పోలీసులు వెల్లడించిన సందర్భంలో నిందితుడి స్నేహితుల ప్రస్తావనలేదు.

దర్యాప్తు 'సాగు..తోందంట'!

సహానా హత్య కేసులో రాజకీయ ఒత్తిళ్ల కారణంగానే పోలీసులు పూర్తిస్థాయిలో విచారణ జరపడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కొల్లిపర మండలం వల్లభాపురం గ్రామానికి చెందిన మార్కెట్ యార్డు మాజీ చైర్మన్, టీడీపీ నాయకుడు వంగా సాంబిరెడ్డికి నవీన్ ప్రధాన అనుచరుడిగా ఉన్నాడు. చంద్రబాబు సమక్షంలోనే టీడీపీలో చేరాడు. కేంద్రమంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అనుచరుడిగా మొన్నటి ఎన్నికల్లో చురుగ్గా పనిచేశాడు. రాజకీయ ఒత్తిళ్ల కారణంగానే కేసు దర్యాప్తు సరిగ్గా జరగడంలేదని సహానా కుటుంబ సభ్యులు అనుమానిస్తున్నారు. నవీన్‌తో పాటు ఉన్న ఇద్దరు స్నేహితులను దత్తు, సుమంత్‌లుగా పోలీసులు గుర్తించినా వారిపై చర్యల్లేవు. కేసు పురోగతిపై టూటౌన్ సీఐ నిసార్ బాషాను వివరణ కోరగా.. ఇంకా పూర్తిస్థాయిలో విచారించాల్సి ఉందని పేర్కొన్నారు.



సీసీ కెమెరాల్లో రికార్డయిన సహానాను ఆస్పత్రిలోకి మోసుకెళ్తున్న నవీన్, పక్కన స్నేహితుడు

వ్యవసాయ విద్యతో ఉజ్వల భవిష్యత్

వైస్ చాన్స్‌లర్ కె.శారద జయలక్ష్మి

బాపట్ల: వ్యవసాయ విద్యతో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని బాపట్ల విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ కె.శారద జయలక్ష్మి పేర్కొన్నారు. కళాశాల ప్రాంగణంలోకి కొత్తగా అడుగు పెడుతున్న మొదటి సంవత్సరం విద్యార్థులకు స్వాగతం పలుకుతూ శుక్రవారం దీక్షారంభ్ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ విశ్వవిద్యాలయ విధి విధానాలు, క్రమశిక్షణ అంశాలపై విద్యార్థులకు అవగాహన కలిగించేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందని తెలిపారు. వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ పి.ప్రసూనారాణి మాట్లాడుతూ పది రోజులపాటు నిర్విఘ్నంగా జరిగే ఈ కార్యక్రమంలో భాగంగా కొత్త విద్యార్థులకు వివిధ డిపార్టుమెంట్లు, గ్రంథాలయం, హెల్త్ క్లినిక్, క్రీడా ప్రాంగణం, కళాశాల వ్యవసాయ క్షేత్ర సందర్శన ఉంటుందని తెలిపారు. అనుభవజ్ఞులైన పూర్వ అధ్యాపకులు, వివిధ రంగాలలో నిష్ణాతులైన ప్రముఖుల ప్రసంగాల ద్వారా వారిలో మానసిక వికాసాన్ని పెంపొందింప చేస్తామని వివరించారు. విద్యార్థుల్లో ఆత్మన్యూనత భావాన్ని తొలగించేందుకు ప్రతిరోజు ఉదయం యోగా, శారీరక దృఢత్వం కోసం ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. వక్తృత్వం, వ్యాసరచన, క్రీడలు, వివిధ సాంస్కృతిక పోటీలను నిర్వహించి, చివరి రోజు అనగా నవంబర్ 2న విజేతలకు బహుమతి ప్రదానం చేస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో డీన్ ఆఫ్ అగ్రికల్చర్ సీహెచ్. శ్రీనివాసరావు, విశ్వవిద్యాలయ అధికారులు, కాలేజ్ ఆఫ్ ఫుడ్ సైన్స్ అసోసియేట్ డీన్ ఎం. సర్దార్ బేగ్, వ్యవసాయ ఇంజినీరింగ్ కళాశాల అసోసియేట్ డీన్ స్మిత్, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ అధికారులు, వివిధ విభాగాల అధిపతులు, బోధన సిబ్బంది పాల్గొన్నారు.



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న వైస్ చాన్స్‌లర్

'డై'యేరియా కలవరం

క్వారీల్లో పనిచేయడం అంటే మృత్యువుతో పోరాటం చేయడమే. ఎప్పుడు ఎటువైపు నుంచి ప్రమాదం ముంచుకొస్తుందో తెలియదు. అయినా పొట్ట కూటి కోసం బతుకు పోరాటం చేస్తున్నారు. కానీ దయేరియా రూపంలో మృత్యువు వారిని కబళిస్తోంది. ఇప్పుడు బతకడం కోసం నిజంగానే పోరాటం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం మాత్రం పట్టీపట్టనట్లు వ్యవహరిస్తోంది. దాచేపల్లి నగర పంచాయతీ పరిధిలోని అంజనాపురం కాలనీలో దయేరియా ప్రబలి ఇద్దరు మృతి చెందగా, 14 మంది చికిత్స పొందుతున్నారు.

అంజనాపురంలో కనీస వసతులు కరవు

- నడిచేందుకు రహదారులు లేవు
- డ్రెయినేజీ వ్యవస్థ లేక నిలిచిన పారుదల
- మురుగులోనే తాగునీటి పైప్‌లైన్లు
- మురికికూపంగా కాలనీ
- తరచూ రోగాల బారిన కాలనీ వాసులు
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం

సాక్షి: నరసరావుపేట: పల్నాడు జిల్లా దాచేపల్లి నగర పంచాయతీ పరిధిలోని అంజనాపురం కాలనీ అభివృద్ధికి నోచుకోవడం లేదు. కనీస వసతులు కరువయ్యాయి. ప్రజలను తరచూ ఆరోగ్య సమస్యలు పట్టిపీడిస్తున్నాయి. నిన్న మొన్నటి వరకు విషజ్వరాలతో మంచం పట్టిన కాలనీవాసులు ఇప్పుడు డయేరియాతో అనారోగ్యం బారిన పడి అల్లాడుతున్నారు. కాలనీలో 120 కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. వీరంతా క్వారీల్లో పనులు చేస్తూ జీవనం కొనసాగిస్తున్నారు. కాలనీలో సరైన రహదారులు లేవు. మురుగు కాలువలు లేవు. దీంతో మురుగు పారుదల లేక ఇళ్ల ముందు నిలిచి దుర్గంధం వెదజల్లుతోంది. పారిశుద్ధ్యం క్షీణించింది.

ప్రబలుతున్న దయేరియా

తొలి విడతలో వాంతులు, విరేచనాలతో ఇద్దరు వ్యక్తులు చనిపోగా..మరో 14మంది చికిత్స పొంతున్నారు. శుక్రవారం కొత్తగా తిరుపతి గోపి, తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు, తమ్మిశెట్టి పార్వతమ్మ, తిరుపతిరావు, తమ్మిశెట్టి అశోక్, బండారు చిరంజీవి, తమ్మిశెట్టి ఆదిలక్ష్మి, మహంకాళి మల్లేశ్వరి వాంతులు, విరేచనాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. వైద్య ఆరోగ్య సిబ్బంది కాలనీలో వైద్య శిబిరాలను కొనసాగిస్తున్నారు. వాంతులు, విరేచనాలతో బాధపడుతున్న వారికి వైద్య సేవలు అందిస్తున్నారు. కొంతమంది ప్రభుత్వ ఆస్పత్రిలోను, మరికొంతమంది ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. గతంలో ఉన్న బోరుకి ఉన్న పైపులైన్‌ని తొలగించి పాత బోరుకి కనెక్షన్ ఇచ్చి నీటిని సరఫరా చేశారు. ఈ బోరులోని నీరు కలుషితం కావటంతో ప్రజలు డయేరియా బారిన పడ్డారు.



కాలువలు లేక రోడ్డుపై నిలిచిన మురుగు

తూతూమంత్రంగా పనులు

వాంతులు, విరేచనాలతో ప్రజలు మంచాన పడటంతో అంజనాపురం కాలనీలో తూతూమంత్రంగా పారిశుద్ధ్యం పనులు చేపట్టారు. మురికి కాలువల్లో పూడికతీత పనులు చేసి బ్లీచింగ్ చల్లారు. వీధుల్లో నిల్వ ఉన్న నీటిలో దోమలు వ్యాప్తి చెందకుండా రసాయనాలు చల్లారు. జేసీబీతో చెట్లు తొలగించారు. కలుషితమైన బోరుని సీజ్ చేసి ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు.

అప్రమత్తంగా ఉండాలి

దాచేపల్లి: అతిసార కేసులపై అప్రమత్తంగా ఉండాలని డైరెక్టర్ ఆఫ్ హెల్త్ డాక్టర్ పద్మావతి అన్నారు. నగర పంచాయతీ పరిధిలోని అంజనాపురంలో శుక్రవారం ఆమె పర్యటించారు. అతిసార కేసుల వివరాలను, వైద్య సేవలపై ఆరా తీశారు. అనంతరం పీహెచ్‌సీలో బాధితులను పరామర్శించారు. నాణ్యమైన వైద్యం అందించాలని, ఆరోగ్య పరిస్థితులు ఆందోళనకరంగా ఉంటే గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించాలని వైద్యులకు సూచించారు. అతిసార కేసులు పెరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.

క్లుప్తంగా

పంచారామాలకు ప్రత్యేక బస్సులు

పట్నంబజారు(గుంటూరు ఈస్ట్): నవంబర్ 2 నుంచి కార్తికమాసాన్ని పురస్కరించుకుని ప్రయాణికుల కోసం ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు ఏపీఎస్ ఆర్టీసీ రీజియన్ మేనేజర్ ఎం.రవికాంత్ చెప్పారు. శుక్రవారం ఆర్టీసీ బస్టాండ్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. కార్తిక మాసంలో రాష్ట్రంలో ప్రసిద్ధి చెందిన పంచారామాలను దర్శించుకునేందుకు అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. సామర్లకోట, అమరావతి, ద్రాక్షారామం, పాలకొల్లు, భీమవరానికి బస్సులను ఏర్పాటు చేసినట్లు వివరించారు. వీటితో పాటు త్రిశైవ క్షేత్రాల దర్శనం యాగంటి, శ్రీశైలం, మహానంది ఆలయాలను ఒకే రోజు దర్శించుకునేందుకు బస్సులను ఏర్పాటు చేసినట్లు వివరించారు. ప్రతి శనివారం, ఆదివారం బస్సులను పంపేందుకు ఆర్టీసీ ఆన్‌లైన్ విధానం ద్వారా రిజర్వేషన్ సౌకర్యం కల్పించినట్టు వెల్లడించారు.. గుంటూరు రీజియన్ పరిధిలో ఐదు డిపోల నుంచి ప్రత్యేక బస్సులు నడుపుతున్నామని, కార్తిక పౌర్ణమి రోజు అమరావతికి ప్రతి 15 నిముషాలకు ఒక బస్సును తిప్పనున్నామని తెలిపారు.

ఇతర రాష్ట్రాల టూర్లకు ట్యాక్స్ మినహాయింపు

కర్ణాటక, తమిళనాడు, కేరళ టూర్‌కు ట్యాక్స్ మినహాయింపుతోపాటు, శబరిబమలకు ఆరు రోజులు, 8 రోజులు, 12 రోజుల టూర్ ప్యాకేజీలను అతి తక్కువ ధరలతో అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు ఆర్ఎం తెలిపారు. గుంటూరు డిపోల నుంచి త్రిశైవ క్షేత్రాలకు ఎక్స్‌ప్రెస్‌కు ఒకొక్కరికి రూ.1080, అల్ట్రాడీలక్స్‌కు రూ.1,380, సూపర్ లగ్జరీకి రూ.1,440గా చార్జి నిర్ణయించామని పేర్కొన్నారు. గుంటూరు నుంచి పంచారామాల దర్శనం కోసం ఎక్స్‌ప్రెస్‌కు రూ.870, అల్ట్రాడీలక్స్‌కు రూ.1,110, లగ్జరీకి రూ.1,160 చార్జి ఉంటుందని వెల్లడించారు. మరిన్ని వివరాల కోసం గుంటూరు డిపో 1, 2 99592 25420, 99592 25421, తెనాలి డిపో 99592 25422, మంగళగిరి డిపో 99592 25424, పొన్నూరు డిపో 99592 25267ను సంప్రదించాలని సూచించారు.

మాతృ మరణాలను అరికట్టాలి

జేసీ ప్రఖర్ జైన్



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ

బాపట్ల: మాతృ మరణాలను అరికట్టడానికి అధికారులు చర్యలు తీసుకోవాలని జేసీ ప్రఖర్ జైన్ ఆదేశించారు. సంబంధిత వైద్య, ఆరోగ్యశాఖ అధికారులతో శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ జిల్లాలో మాతృ మరణాలు అరికట్టడానికి అధికారులంతా సమన్వయంతో కృషి చేయాలని చెప్పారు. గత మూడు నెలల్లో ఏడు మాతృ మరణాలు నమోదు కావడంపై క్షుణ్ణంగా ఆరా తీశారు. కారణాలపై నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. రక్తహీనత నివారణతో మాతృ మరణాలు పూర్తిస్థాయిలో అరికట్టవచ్చని ఆయన సూచించారు. గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని, రక్తహీనత ఉంటే ముందుగానే గుర్తించి మెరుగైన వైద్యం అందించాలని తెలిపారు. అలాంటి వారికి ప్రణాళికాబద్ధంగా ముందస్తుగానే పౌష్టికాహారాన్ని అందించాలని చెప్పారు. వైద్యం అందించడంలో లోపాల్ని సవరించుకోవాలని ఆయన ఆదేశించారు. సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్. విజయమ్మ, డీసీహెచ్ఎస్ కోఆర్డినేటర్ శేషుబాబు, డాక్టర్లు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

అభినందనలు



ఉమ్మడి గుంటూరు జిల్లా వైఎస్సార్ సీపీ రీజినల్ కోఆర్డినేటర్‌గా బాధ్యతలు చేపట్టిన వైఎస్సార్ సీపీ రాజ్యసభ సభ్యుడు వై.వి. సుబ్బారెడ్డికి పార్టీ రేపల్లె ఇన్‌చార్జి వరికూటి అశోక్ బాబు అభినందనలు తెలిపారు. తాడేపల్లిలోని స్వగృహంలో శుక్రవారం ఆయన్ను కలసి పుష్పగుచ్ఛం అందజేశారు. –వేమూరు

29, 30 తేదీల్లో ప్రభుత్వ ఉద్యోగులకు క్రీడలు

నరసరావుపేట ఈస్ట్: పల్నాడు జిల్లా పరిధిలోని ప్రభుత్వ ఉద్యోగులకు ఈనెల 29, 30తేదీలలో వివిధ క్రీడాంశాలలో జిల్లా జట్టు ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్టు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి జి.సురేష్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సత్తెనపల్లిరోడ్డులోని డీఎస్ఏ స్టేడియంలో ఆయా తేదీలలో అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్, చెస్, టెన్నిస్, క్రికెట్, కబడ్డీ, రెజ్లింగ్, వాలీబాల్, బాస్కెట్‌బాల్, ఖోఖో, స్విమ్మింగ్ తదితర క్రీడలలో ఎంపిక పోటీలు జరుగుతాయని తెలిపారు. ఆసక్తి గల ప్రభుత్వ ఉద్యోగులు తమ కార్యాలయ గుర్తింపుకార్డు, ఇతర ధృవపత్రాలతో 29వ తేదీ ఉదయం జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ కార్యాలయం వద్ద హాజరు కావాలని తెలిపారు. ఆయా క్రీడాంశాలలో ఎంపికైన వారు నవంబరు 6 నుంచి 9వ తేది వరకు విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీలలో పల్నాడు జిల్లాకు ప్రాతినిధ్యం వహిస్తారని పేర్కొన్నారు. వివరాలకు 8712622574 నెంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

దేశాభివృద్ధిలో యువత పాత్ర కీలకం

- గుంటూరు జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ స్వప్నిల్ పవార్
- ముగిసిన కాశ్మీరీ యువ సమ్మేళనం


కాశ్మీరీ యువ సమ్మేళనంలో సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థులతో అతిథులు

ఏఎన్‌యూ(గుంటూరు): దేశాభివృద్ధిలో యువత పాత్ర కీలకమని గుంటూరు జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ స్వప్ననిల్ పవార్ అన్నారు. భారత ప్రభుత్వ యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వ శాఖ, నెహ్రూ యువ కేంద్రం, గుంటూరు ఆధ్వర్యంలో ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయంలో ఆరురోజుల పాటు జరిగిన నాలుగో కాశ్మీరీ యువ సమ్మేళనం శుక్రవారంతో ముగిసింది. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అసిస్టెంట్ కలెక్టర్ స్వప్నిల్ పవార్ మాట్లాడుతూ అభివృద్ధి కార్యకలాపాలు, నైపుణ్య అభివృద్ధి, విద్య, ఉపాధికి దోహదం చేసే అంశాలపై యువత దృష్టి సారించాలన్నారు. దేశంలోని పలు ప్రాంతాల్లో సాంకేతిక, పారిశ్రామిక పురోగతిని కాశ్మీర్ యువతకు పరిచయం చేయడానికి ఈ కార్యక్రమం దోహదం చేస్తుందన్నారు. ఏఎన్‌యూ వీసీ గంగాధరావు మాట్లాడుతూ ఈ సమ్మేళనంలో భాగమైన వివిధ అంశాలపై కార్యశాలలు, క్షేత్ర స్థాయి సందర్శనల ద్వారా కాశ్మీరీ యువతకు జాతీయ ఐక్యత, సమగ్రత వంటి అంశాలపై లోతైన అవగాహన కలుగుతుందన్నారు. నెహ్రూ యువ కేంద్ర సంఘటన్ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర సంచాలకులు అంశుమాన్ ప్రసాద్ దాస్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఎంపికైన నెహ్రూ యువకేంద్రాలలో గత నాలుగు సంవత్సరాలుగా కాశ్మీరీ యువ సమ్మేళనం నిర్వహిస్తున్నామన్నారు. గుంటూరు నెహ్రూ యువ కేంద్ర జిల్లా యువ అధికారి కిరణ్మయి దేవిరెడ్డి మాట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయటానికి అన్ని శాఖల ప్రతినిధులు సహకరించారన్నారు. ఏఎన్‌యూ ఎన్ఎస్ఎస్ కో–ఆర్డినేటర్ ఆచార్య దివ్యతేజోమూర్తి, విశాఖపట్నం జిల్లా , నెహ్రూ యువ కేంద్ర అధికారి జి మహేశ్వరరావు, చిత్తూర్ జిల్లా నెహ్రూ యువ కేంద్ర అధికారి ప్రదీప్ బెహరా పాల్గొన్నారు. కార్యక్రమంలో కాశ్మీర్‌లోని పుల్వామా, బుద్గామ్, శ్రీనగర్, కుప్వారా, బారాముల్లా, అనంతనాగ్ జిల్లాల నుంచి 132 మంది యువతీ యువకులు సమ్మేళనానికి హాజరయ్యారు. వారికి సర్టిఫికెట్లు ప్రదానం చేశారు.

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనే ధ్యేయం


అవగాహన కార్యక్రమంలో అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ ప్రభాకరరావు

రేపల్లె రూరల్: బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ ప్రభాకరరావు తెలిపారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన కార్యక్రమాలలో భాగంగా శుక్రవారం పట్టణంలోని పలు దుకాణాలలో తనిఖీలు నిర్వహించి అనంతరం మాట్లాడారు. 18 సంవత్సరాలలోపు చిన్నారులంతా బడిబాట పట్టేలా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కృషి చేయాలని తెలిపారు. చిన్నారులు బడిబాట పడితే వారి భవిష్యత్ బంగారు బాట పడుతుందని చెప్పారు. చిన్నారులను దుకాణాలలో గానీ ఇతర సంస్థలలో గానీ చేర్చుకుని పనులు చేయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. దుకాణాలలో చిన్నారులతో పనులు చేయిస్తే ప్రజలు తమకు సమాచారం అందించాలని ఆయన కోరారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు నిర్వహిస్తున్న ప్రత్యేక తనిఖీలు జిల్లావ్యాప్తంగా నవంబర్ 21 వరకు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సిఫార్డ్ స్వచ్ఛంద సేవా సంస్థ జిల్లా కోఆర్డినేటర్ బడుగు కిశోర్, వివిధ హాస్టళ్ల వార్డెన్లు ఈ.నిర్మల, పద్మావతి, లక్ష్మీప్రసన్న, ఎన్‌జీవో మరియజ్యోతి పాల్గొన్నారు.

రేపు కర్రసాము పోటీలు

గుంటూరు వెస్ట్ (క్రీడలు): సిలంబమ్ స్టిక్ ఫెన్సింగ్ అసోసియేషన్ ఆఫ్ ఏపీ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ మెమోరియల్ జాతీయ సిలంబమ్ (కర్రసాము) పోటీలు ఆదివారం ఉదయం ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహిస్తామని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డీఎస్ క్రిష్టోఫర్ శుక్రవారం తెలిపారు. సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ విభాగాల్లో పోటీలు ఉంటాయని చెప్పారు. ఆసక్తిగల క్రీడాకారులు పాల్గొనవచ్చన్నారు. వివరాలకు 92471 11266 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

రైతు ఉత్పత్తిదారుల సంఘాలతో మేలు

విజ్ఞాన్ విశ్వవిద్యాలయం ఉప కులపతి ప్రొఫెసర్ నాగభూషణం


ఆధునిక విధానంలో పండిస్తున్న పంటను పరిశీలిస్తున్న డాక్టర్ నాగభూషణం

తెనాలి: రైతు ఉత్పత్తిదారుల సంఘాలతో ఎంతో ప్రయోజనమని వడ్లమూడిలోని విజ్ఞాన్ విశ్వవిద్యాలయం ఉప కులపతి ప్రొఫెసర్ పి.నాగభూషణం అభిప్రాయపడ్డారు. కొల్లిపరలోని శ్రేష్ట రైతు ఉత్పత్తిదారుల సంఘాన్ని శుక్రవారం ఆయన తన బృందంతో కలిసి సందర్శించారు. సంఘ కలెక్షన్ సెంటర్‌ను కోల్డ్ స్టోరేజిని, పంటపొలాల్లో భూసారం తెలుసుకునేందుకు వినియోగిస్తున్న ఆధునిక పరికరాలను పరిశీలించారు. రైతు ఉత్పత్తిదారుల సంఘం పనితీరును, రైతుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. సమష్టిగా అమలుచేస్తున్న వ్యవసాయ విధానాలు, ఆధునిక సాంకేతిక విజ్ఞానాన్ని ఉపయోగిస్తున్న తీరును ఆయన అభినందించారు. వీరితో విజ్ఞాన్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ అండ్ ఫుడ్ టెక్నాలజీ డీన్ డాక్టర్ టి.రమేష్ బాబు, వ్యవసాయ, ఉద్యాన శాస్త్రాల విభాగం సమన్వయకర్త డాక్టర్ టి.నరేష్ పాల్గొన్నారు.

రేపు ఆనందశేఖర్ జయంత్ నృత్య ప్రదర్శన

నగరంపాలెం(గుంటూరు వెస్ట్): రోటరీ క్లబ్, ఠాగూర్ థియేటర్ మెమోరియల్ ట్రస్ట్, భారతీయ విద్యా భవన్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రఖ్యాత నాట్య కళాకారిణి పద్మశ్రీ డాక్టర్ ఆనందశేఖర్ జయంత్ నృత్య ప్రదర్శనను ఆదివారం ఏర్పాటు చేసినట్లు ఠాగూర్ మెమోరియల్ ట్రస్ట్ థియేటర్ కార్యదర్శి పి.రామచంద్రరాజు తెలిపారు. కలెక్టర్ బంగ్లా రోడ్డులోని భారతీయ విద్యాభవన్ ఆడిటోరియంలో శుక్రవారం జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 27న ఆదివారం సాయంత్రం ఆరు గంటలకు గుంటూరు శ్రీవేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ప్రదర్శన జరుగుతుందని చెప్పారు. అల్లూరి సీతారామరాజు జీవిత చరిత్రను నృత్య రూపకంలో ఆమె ప్రదర్శించనున్నారని తెలిపారు. ఇంటాక్ సంస్థ రాష్ట్ర కన్వీనర్ ఎస్‌వీఎస్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ప్రపంచ తెలుగు మహాసభ-2026లో భాగంగా తెలుగు కళ, సాంస్కృతిక రూపాలు సంగీతం, నాట్యం, సాహిత్యం, అవధానం వంటి పక్రియలన్నీ 14 నెలలపాటు గుంటూరు, కృష్ణా జిల్లాల్లో ప్రదర్శిస్తామని తెలిపారు.

జాతీయ వాలీబాల్ పోటీలకు లక్ష్మీప్రసన్న ఎంపిక


విద్యార్థిని లక్ష్మీప్రసన్నతో ఉపాధ్యాయులు

జే.పంగులూరు: జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలకు బూదవాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని ఎంపికైంది. సత్యసాయి జిల్లా హిందూపురంలో ఈనెల 21, 22, 23 తేదీల్లో 68వ రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలు జరిగాయి. ఇందులో బూదవాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన వజ్రాల లక్ష్మీప్రసన్న ఉత్తమ ప్రతిభ కనబరిచింది. ఉత్తర్‌ప్రదేశ్‌లో జరగబోయే జాతీయ స్థాయిలో పోటీలకు ఎంపికైనట్లు పీడీ వెంకట్రావు శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా లక్ష్మీప్రసన్నను ఉపాధ్యాయులు సీహెచ్. శ్రీనివాసరావు, ఎస్. సోమశేఖరరావు, సీహెచ్. లక్ష్మీనారాయణ, పాఠశాల కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు అభినందించారు.

పెసర్లంక విద్యార్థిని ప్రతిభ



భట్టిప్రోలు: ఉమ్మడి గుంటూరు జిల్లా అండర్–14 బాలికల కబడ్డీ టీమ్‌కు భట్టిప్రోలు మండలం పెసర్లంక దేవభక్తుని కోటయ్య జిల్లా పరిషత్ హైస్కూల్‌కు చెందిన పులివర్తి లిఖిత (8వ తరగతి) ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు షేక్ మహబూబ్ బాషా, ఫిజికల్ డైరెక్టర్ దాసరి వెంకట ప్రసాద్ శుక్రవారం తెలిపారు. ఎస్‌జీఎఫ్ఏ ఆధ్వర్యంలో నవంబర్ 9 నుంచి 11వ తేదీ వరకు పిట్టలవానిపాలెంలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో లిఖిత పాల్గొననున్నట్లు చెప్పారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు దీపిక...


దీపికతో హెచ్ఎం, పీడీ

చినగంజాం: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు చినగంజాం మండలం అడివీధిపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన రామాని వెంకట దీపిక ఎంపికైంది. ఒంగోలు పీవీఆర్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో ఈనెల 24న నిర్వహించిన పోటీల్లో ఆమె ప్రతిభ కనబరచి జిల్లా జట్టుకు ఎంపికైంది. అన్నమయ్య జిల్లా రాయచోటిలో ఈ నెల 27,28,29 తేదీల్లో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా జట్టు తరఫున ఆడనుంది. ఈ సందర్భంగా దీపికను హెచ్ఎం మాధవీలతతో పాటు, పీడీ బూసం లలిత, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

వాలీబాల్ పోటీల్లో భట్టిప్రోలు విద్యార్థిని సత్తా



భట్టిప్రోలు : ఎస్‌జీఎఫ్ఏ ఆధ్వర్యంలో హిందూపూర్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి బాలికల వాలీబాల్ పోటీల్లో ఉమ్మడి గుంటూరు జిల్లా జట్టు ప్రథమ స్థానం సాధించింది. భట్టిప్రోలు టీఎంరావు హైస్కూల్‌కు చెందిన సయ్యద్ షబీనా జట్టు విజయంలో కీలక పాత్ర పోషించింది. పోటీల్లో ప్రతిభ చూపిన షబీనాను ప్రధానోపాధ్యాయులు చందలూరి రామకోటేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు వేటపాలెం విద్యార్థుల ఎంపిక


గురుకుల పాఠశాల విద్యార్థులతో ఉపాధ్యాయులు


విద్యార్థిని లతతో ఉపాధ్యాయులు

వేటపాలెం: రాష్ట్రస్థాయి ఆటల పోటీలకు వివిధ పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు ఎంపికయ్యారు. స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల్లో పదో తరగతి చవుదుతున్న విద్యార్థిని కే లత అండర్–17 విభాగంలో కబడ్డీ పోటీలకు ఎంపికైంది. రైల్వేస్టేషన్ బీసీ గురుకుల పాఠశాల నుంచి అండర్–14 కబడ్డీ పోటీలకు పి. కిశోర్, అండర్–14 విభాగం ఖోఖో పోటీలకు కే శివశంకర్ ఎంపికయ్యారు. ఒంగోలులోని పీవీఆర్ బాలుర ఉన్నత పాఠశాలలలో ఈ నెల 24న జిల్లా స్థాయి పోటీలు నిర్వహించినట్లు హెచ్ఎంలు తెలిపారు. ఇందులో విద్యార్థులు ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికై నట్లు వారు చెప్పారు. కడప జిల్లా రాయచోటిలో ఈనెల 26 నుంచి రాష్ట్రస్థాయి పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను హెచ్ఎంలు ఫణికుమార్, నారాయణస్వామి, పీఈటీలు మమత, కోటేశ్వరమ్మ, ఉపాధ్యాయులు అభినందించారు.

విద్య ప్రైవేటీకరణ, కాషాయీకరణకు వ్యతిరేకంగా పోరాడాలి

ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివారెడ్డి



లక్ష్మీపురం(గుంటూరు): కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం విద్య ప్రైవేటీకరణ, కాషాయీకరణకు పూనుకుంటుందని, దీనికి వ్యతిరేకంగా పోరాడాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివారెడ్డి పిలుపునిచ్చారు. అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఏఐఎస్ఎఫ్ గుంటూరు జిల్లా 37వ మహాసభల ర్యాలీ శుక్రవారం జరిగింది. అనంతరం స్థానిక కొత్తపేటలోని మల్లయ్య లింగం భవన్ ఎదుట ఏఐఎస్ఎఫ్ జెండాను సంఘ మాజీ జిల్లా కార్యదర్శి ఆకిటి అరుణ్ కుమార్ ఆవిష్కరించారు. మల్లయ్య లింగం భవన్‌లో పాశం వెంకటేష్ అధ్యక్షతన నిర్వహించిన సభలో శివారెడ్డి మాట్లాడారు. బీజేపీ విధానాలకు వ్యతిరేకంగా ప్రతిఒక్కరూ పోరాడాలని పేర్కొన్నారు. విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఏఐఎస్ఎఫ్ సమరశీల పోరాటాలకు సిద్ధపడుతోందని చెప్పారు. సభలో ఏఐఎస్ఎఫ్ మాజీ నాయకులు జంగాల అజయ్ కుమార్, రాధాకృష్ణమూర్తి, కోట మాల్యాద్రి, అరుణ్ కుమార్, జంగాల చైతన్య, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పాశం వెంకటేష్, బందెల నాసర్‌జీ, జిల్లా ఆఫీస్ బేరర్స్ శశి, అభిషేక్, శివా, నవ్యశ్రీ, గోపి, నాయకులు డేవిడ్, అమర్నాథ్, సాయి, పవన్, చందు, గౌతమ్, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

34,380 బస్తాల మిర్చి విక్రయం



కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు శుక్రవారం 29,233 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 34,380 బస్తాల అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి రూ. 15,500 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి 18,600 వరకు లభించింది. ఏసీ కామన్ రకం మిర్చి రూ. 8,500 నుంచి రూ. 16,000 వరకు లభించింది. ఏసీ ప్రత్యేక రకం రూ. 8,500 నుంచి రూ. 18,500 వరకు ధర పలికింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.11,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 18,914 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

ట్రాక్టర్ ట్రక్కు బోల్తా


రోడ్డుపై పడిపోయిన ఇసుక

చెరుకుపల్లి: అతి వేగంగా వెళుతున్న ఇసుక ట్రాక్టర్ ట్రక్కు ఊడిపోయి రెండు పల్టీలు కొట్టిన ఘటన చెరుకుపల్లి శివారులో శుక్రవారం మధ్యాహ్నం జరిగింది. ట్రక్కు చివరి భాగం ద్విచక్ర వాహనానికి తగలడంతో పసి పాప సహా ముగ్గురూ పిచ్చి మొక్కల్లో పడిపోయారు. స్థానికుల కథనం ప్రకారం.. శుక్రవారం మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో భట్టిప్రోలు మండలం జువ్వలపాలెం రేవు నుంచి ఇసుక లోడుతో చెరుకుపల్లి వైపు నుంచి ట్రాక్టర్ తెనాలి వైపు వెళుతోంది. చెరుకుపల్లి ఊరు చివర మూలమలుపు వద్ద ట్రాక్టర్ ట్రక్కు అదుపు తప్పి రెండు పల్టీలు కొట్టింది. అదే మార్గంలో ఎదురుగా ద్విచక్ర వాహనంపై సంవత్సరంలోపు పసి బిడ్డను ఒడిలో పెట్టుకుని దంపతులు వస్తున్నారు. ట్రక్కు చివరి భాగం తగలడంతో పసి పాప సహా ముగ్గురూ పిచ్చిమొక్కల్లో పడిపోయారు. వెంటనే స్థానికులు వారిని బయటకు తీసి కాపాడారు. పసి పాప గుక్కపెట్టి ఏడుస్తుండటంతో వెంటనే దగ్గరలోని వైద్యశాలకు తీసుకెళ్లి చికిత్స చేయించారు. ప్రమాదం నుంచి ముగ్గురు బయటపడ్డారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు ట్రాక్టర్ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు.

రేపు అఖిల భారత యాదవ మహాసభ

గుంటూరు మెడికల్: యాదవులు రాజ్యాధికారంలో ప్రధాన భూమిక పోషించేలా అఖిల భారత యాదవ మహాసభ చైతన్య పరుస్తోందని అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు నాగమల్లేశ్వరి పేర్కొన్నారు. అరండల్‌పేటలోని కార్యాలయంలో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈనెల 27న అరండల్‌పేటలోని వైన్స్ డీలర్ కల్యాణ మండపంలో అఖిల భారత యాదవ మహాసభ గుంటూరు జోనల్ సభ నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. సభకు కేంద్ర, రాష్ట్ర నాయకులు హాజరవుతున్నారని వెల్లడించారు. సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆవుల వీర శేఖర్ యాదవ్, బాపట్ల జిల్లా అధ్యక్షుడు తాడిపోయిన లక్ష్మీ ప్రసాద్, గుంటూరు జిల్లా అధ్యక్షుడు కొల్లికొండ శంకర్‌రావు, పొన్నూరు అధ్యక్షుడు ఆలా సాంబశివరావు, అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర నాయకురాలు చాముండేశ్వరి, రాధాదేవి పాల్గొన్నారు.